ఇదెలా సాధ్యం గోవిందా..?

- వైఎస్సార్‌సీపీ హయాంలో తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు కేటాయిస్తే తప్పా..?
- ఇప్పుడు మీరు శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు టీటీడీ నిధులు ఎలా కేటాయిస్తారు ?
- ఇప్పటికైనా భానుప్రకాష్‌రెడ్డి కోర్టు కేసు వెనక్కి తీసుకుని తిరుపతి అభివృద్ధికి సహకరించాలి
- తిరుపతి అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తే స్వాగతిస్తాం
- వైఎస్సార్‌సీపీ తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి



తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ హయాంలో తిరుపతిలోని రోడ్లు అభివృద్ధి, పారిశుద్ధ్యం పరిశుభ్రత కోసం టీటీడీ నిధులు కేటాయిస్తే తప్పు పట్టిన పెద్దలు.. ఇప్పుడు టీటీడీ బోర్డు సమావేశంలో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు టీటీడీ నుంచి రూ.కోటి నిధులు ఎలా కేటాయిస్తారని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ప్రశ్నించారు. తిరుపతి పద్మావతిపురంలోని తన నివాసం వద్ద మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీటీడీ పాలకవర్గం శ్రీనివాస స్పోర్ట్స్‌కాంప్లెక్స్‌కు రూ.కోటి కేటాయించడాన్ని వైఎస్సార్‌సీపీ స్వాగతిస్తోందన్నారు. అందుకు బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డికి తాము కృతజ్ఞతలు కూడా తెలుపుతున్నామని.. తిరుపతి అభివృద్ధికి ఏ రూపంలో నిధులు వచ్చినా అభినందిస్తామని చెప్పారు. అయితే శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు టీటీడీకి ఏమి సంబంధం ఉంది భానుప్రకాష్‌రెడ్డి ?. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు టీటీడీ ఎందుకు నిధులు కేటాయించింది ? దానిని భానుప్రకాష్‌రెడ్డి ఏ విధంగా సమర్థిస్తారని ప్రశ్నించారు. గతంలో వైఎస్సార్‌సీపీ హయాంలో తిరుపతిలో భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్ సమస్య లేకుండా చేసేందుకు కొత్త రోడ్లను వేసేందుకు టీటీడీ నిధులు ఖర్చు చేయాలనుకున్నప్పుడు ఎందుకు అడ్డుకున్నారన్నారు. తిరుపతి ఆధ్యాత్మిక నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్న ఉద్దేశంతో ఒక పారిశుద్ధ్య ప్రాజెక్టును అమల్లోకి తెచ్చి దాదాపు 1700 మందిని మున్సిపల్ కార్పొరేషన్‌లోకి కేటాయించాలనుకున్నప్పుడు ఎందుకు ఆపారని ప్రశ్నించారు. ఇప్పుడు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు టీటీడీ నిధులు ఇవ్వడం ఒప్పు అయిందా? అప్పుడు రోడ్లు వేయడానికి, పారిశుద్ధ్యాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి టీటీడీ నిధులు వినియోగించుకోవడం తప్పు అని చెప్పిన భానుప్రకాష్‌రెడ్డి ..ఇప్పుడెలా సమర్థిస్తారు అని అన్నారు. మీ రెండు నాలుకల ధోరణి స్పష్టంగా బయట పడిందన్నారు.

కార్మికుల అవస్థలు కనిపించవా ?

ప్రతి రోజు లక్షలాది మంది శ్రీవారి భక్తులు వచ్చే తిరుపతిని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. గతంలో మీరు కోర్టుకు వెళ్లిన కేసును వెనక్కి తీసుకుంటే భారతదేశంలోనే ఎంతో పరిశుభ్రమైన నగరంగా తిరుపతిని చూడవచ్చని ఎద్దేవా చేశారు. తిరుపతి నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాల్సిన బాధ్యత స్థానిక కూటమి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై కూడా ఉందన్నారు. తిరుపతిని పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు పడుతున్న అవస్థలు మీకు కనబడడం లేదా? ఎందుకని భానుప్రకాష్‌రెడ్డి చేత కేసు వెనక్కి తీసుకోమని చెప్పడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వానికి నచ్చినట్లుగా చంద్రబాబును మెప్పించేలా శాప్ చైర్మన్ రవినాయుడు అడగంగానే శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు రూ.కోటి కేటాయిస్తారు కానీ.. తిరుపతి అభివృద్ధికి, పారిశుద్ధ్యం , పరిశుభ్రతకు టీటీడీ నిధులు ఖర్చు చేయడంలో ఎందుకు శ్రద్ధ చూపరు అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే స్థానికేతరులు గనుక తిరుపతిపై శీతకన్ను వేశారా? అందుకే తిరుపతి అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదా ? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా భానుప్రకాష్‌రెడ్డి అవలంభిస్తున్న తన మొండివైఖరిని వీడాలన్నారు. తిరుపతి అభివృద్ధిని వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ స్వాగతిస్తుందన్నారు.

క్లుప్తంగా

టీటీడీకి కెమెరా విరాళం

తిరుమల: నెల్లూరుకు చెందిన వంశీరామ్ బిల్డర్స్ అధినేత వంశీరామ్ సుబ్బారెడ్డి మంగళవారం రూ.8.84 లక్షలు విలువైన కెనాన్ డిజిటల్ మిరర్ లెస్ కెమెరా, లెన్సులను టీటీడీకి విరాళంగా అందించారు. దాత తరఫున టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి తిరుమలలోని టీటీడీ అదనపు ఈఓ కార్యాలయంలో కెమెరాను అందజేశారు.


కల్వర్టును ఢీకొన్న కారు



కారును క్రేన్ సహాయంతో తీస్తున్న పోలీసులు

పాకాల: రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొనడంతో కారులో వెళ్తున్న నలుగురు వ్యక్తులు గాయపడిన ఘటన గాదంకి ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద చోటు చేసుకుంది. మంగళవారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై రైల్వేకోడూరుకు చెందిన నలుగురు వ్యక్తులు తిరువణ్ణామలై వెళ్లి ఏపీ40డీఎస్0060 నంబరు గల కారులో తిరుపతి వైపు వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన వ్యక్తులను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. సీఐ సుదర్శన్‌ప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్రేన్ సహాయంతో కారును రోడ్డుకు అడ్డు లేకుండా పక్కన పెట్టారు.

సీఎం సమీక్షలో అధికారులు



సీఎం సమీక్షకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన జేసీ, డీఆర్వో, జిల్లా అధికారులు


తిరుపతి అర్బన్: అమరావతిలో మంగళవారం సీఎం చంద్రబాబునాయుడు కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ హాజరయ్యారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కట్టమీద గంగమ్మకు పూజలు



భాకరాపేట : మండలంలోని చినిగేపల్లె కట్టమీద గంగమ్మకు పౌర్ణమిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. మంగళవారం అమ్మవారికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, నాగలక్ష్మి, సర్పంచ్ సింహాల విమల, గ్రామస్తులు పాల్గొన్నారు.


పీఠాధిపతుల ఆశీస్సులు



పీఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామీజీ ఆశీస్సులు తీసుకుంటున్న టీటీడీ చైర్మన్

తిరుమల: పాలిమారు మఠం పీఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామీజీ, భీమనకట్టె మఠం పీఠాధిపతి రఘువరేంద్ర తీర్థ స్వామీజీలను తిరుమలలోని వ్యాసరాజ మఠంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు మాట్లాడుతూ భక్తులు సంతృప్తిగా తిరుమల యాత్రను పూర్తి చేసుకునేలా టీటీడీ పని చేయాలని చైర్మన్‌కు సూచించారు. అనంతరం వారు ఆయనకు ఆశీస్సులు అందజేశారు. టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్ కుమార్ పాల్గొన్నారు.

'వృషభం' చిత్రాన్ని ఆదరించండి



మాట్లాడుతున్న సహ నిర్మాత మల్లికారెడ్డి

తిరుపతి కల్చరల్: గోవధ మహాపాపం అనే ఇతివృత్తంతో పాటు గోవుకు మనిషికి ఉన్న సంబంధాలను ఆవిష్కరిస్తూ అద్భుతంగా రూపొందించిన చిత్రం 'వృషభం' అని దర్శకుడు కామరాజు, సహ నిర్మాత, ప్రముఖ నటుడు జయప్రకాష్ కుమార్తె మల్లికారెడ్డి తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏప్రిల్ 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా థియేటర్లలో విడుదలవుతున్న ఈ చిత్రాన్ని ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో హీరోహీరోయిన్లు జీవన్‌రెడ్డి, అలేఖ్య, నిర్మాత ఉమా శంకర్‌రెడ్డి, ఇతర నటులు పాల్గొన్నారు.

14న ఎస్టీ వర్గీకరణ భేరి

తిరుపతి కల్చరల్: అత్యంత అణగారిన వర్గాలైన గిరిజన, యానాదుల అభ్యున్నతిని కాంక్షిస్తూ ఏప్రిల్ 14వ తేదీ నెల్లూరు టౌన్ హాల్లో నిర్వహించే ఎస్టీ వర్గీకరణ భేరిని జయప్రదం చేయాలని ఏపీ యానాదుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెంచు మల్లిఖార్జునరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఎస్టీ వర్గీకరణ భేరి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర నేత పెంచలయ్య పిలుపు మేరకు నెల్లూరులో జరిగే ఎస్టీ వర్గీకరణ భేరిలో యానాదులంతా కలిసి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యానాదుల సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు.

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ



వివాదాస్పదమైన భూమిలో గొడవలు పడుతున్న ఇరువర్గాలు




తిరుచానూరు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరిన ఇరువర్గాలకు సంబంధించిన వారు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు కుంటి గంగమ్మ వీధిలోని సర్వే నంబరు 398/12 లోని భూమికి సంబంధించిన వివాదంలో ఇరువర్గాలు మంగళవారం ఘర్షణకు దిగాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. వివాదాస్పదమైన ఇనాం భూమిలోకి ప్రవేశించిన ఇరువర్గాలు ఒకరిపై మరొకరు దాడులు చేసుకోవడంతో ఓ మహిళ, మరో ముగ్గురు వ్యక్తులు గాయపడగా ఆ ప్రాంతంలోని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారం మేరకు.. పోలీసుల రాకతో భూపంచాయతీ తిరుచానూరు పోలీస్ స్టేషన్‌కు చేరింది. అయితే ఇరువర్గాలు అధికార పార్టీకి చెందిన వారే కావడంతో పోలీసులు సైతం ఆచీతూచీ అడుగులు వేశారు. అయితే ఆ భూవివాదంలో ఏ సంబంధం లేని కొందరు బయట వ్యక్తులు అక్కడకు చేరుకుని దాడులు చేసినట్టు గుర్తించిన పోలీసులు వారికి వార్నింగ్ ఇచ్చి పంపినట్టు సమాచారం. దాడుల్లో గాయపడిన ఇరువర్గాల వారు తిరుచానూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ హడావుడి చేయడంతో శ్రీ పద్మావతీ అమ్మవారి దర్శనార్థం అటుగా వెళ్లే భక్తులు ఏం జరిగిందోనని భయాందోళన చెందారు.

27న తిరుపతి రూరల్ ఎంపీపీ ఎన్నిక

- ఎన్నికల అధికారిగా డిప్యూటీ సీఈఓ జుబేద
- మొత్తం 40 మంది ఎంపీటీసీలకు గాను 37 మందికి అవకాశం
- నేడు తమ ఎంపీటీసీలకు విప్ జారీ చేయనున్న వైఎస్సార్‌సీపీ



తిరుపతి రూరల్ : తిరుపతి మండల పరిషత్ అధ్యక్ష స్థానానికి ఈనెల 27న ఎన్నిక జరుగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేయడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా డిప్యూటీ సీఈఓ జుబేదాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఆమె తిరుపతి రూరల్ ఎంపీడీవో కార్యాలయంకు చేరుకుని ఎన్నిక నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలించారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రితో పాటు డిజిటల్ కెమెరాలు, ఎన్నికల విధులు నిర్వహించేందుకు అవసరమైన సిబ్బంది ఎంపిక, చేపట్టాల్సిన ఏర్పాట్లపై తిరుపతి రూరల్ ఎంపీడీఓ రామచంద్రతో సమీక్షించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది 26వ తేదీన ఉదయం 10 గంటల నుంచి ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో అందుబాటులో ఉండేలా నిర్ణయించారు. అనంతరం మండల పరిషత్ పరిధిలో ఎంతమంది ఎంపీటీసీలు ఉన్నారు ? ఏ పార్టీకి ఎంతమంది మద్దతు తెలిపే అవకాశం ఉంటుంది ? గొడవలు జరిగే పరిస్థితులు ఉన్నాయా..? పోలీసులకు సమాచారం అందించారా ? తదితర విషయాలపై చర్చించారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రాథమికంగా తీసుకున్న చర్యలుపై ఆమెకు వివరించారు.

నేడు ఎంపీటీసీలకు విప్ జారీ !

తిరుపతి రూరల్ మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన ఎంపీటీసీలకు బుధవారం విప్ జారీ చేయనున్నారు. మండలం పరిధిలో మొత్తం 40 ఎంపీటీసీ స్థానాలు వుండగా అందులో ఒక స్థానానికి ఎన్నిక జరగలేదు. మరో రెండు ఎంపీటీసీలు ఖాళీగా ఉన్నాయి. దీంతో 37 మంది ఎంపీటీసీలకు ఓటు వేసే అవకాశం దక్కింది. ఇందులో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా 34 మంది ఎంపీటీసీలు ఉండగా మరో ముగ్గురు టీడీపీకి అనుకూలంగా ఉన్నట్టు సమాచారం. మెజారిటీ ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు ఉండగా, అధికారంలో ఉన్న కూటమి పార్టీలకు తగినంత సంఖ్యాబలం లేకున్నా ఎంపీపీ పదవిని చేజిక్కించుకునేందుకు కుట్రలకు పాల్పడే అవకాశం ఉంది.

లైంగిక వేధింపులపై విచారణకు ఆదేశం

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలోని ల్యాబ్లో పనిచేసే పారామెడికల్ సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు పాల్పడిన సిబ్బందిపై ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ విచారణకు ఆదేశించారు. రూమ్ నంబర్ 13 సెంట్రల్ ల్యాబ్‌లోని ఇద్దరు టెక్నీషియన్లు పారా మెడికల్ సిబ్బందిని వేధించడంతో ఇటీవల ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ఇద్దరిని మరో ప్రాంతానికి బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. అయితే ఈ విషయం వెలుగులోకి వచ్చి సంచలనంగా మారడంతో ఎట్టకేలకు మంగళవారం విచారణకు ఆదేశించారు. రుయా సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌తో పాటు మరో ఇద్దరితో కూడిన కమిటీని వేశారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

పారామెడికల్ సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు పాల్పడిన టెక్నీషియన్లపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్వీయూ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘ నేతలు ఆందోళనకు దిగారు. ఈ మేరకు రుయా సూపరింటెండెంట్ చాంబర్ వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ లైంగిక వేధింపులకు పాల్పడిన ఇద్దరు టెక్నీషియన్లు గతంలోనూ సస్పెండ్ అయ్యారని గుర్తు చేశారు. ఈ క్రమంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి విద్యార్థి సంఘాల నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఏపీ స్టూడెంట్ జేఏసీ హేమంత్ యాదవ్, బీసీ ఆర్గనైజేషన్ ప్రతినిధి తిరుమలేష్, ఏపీ విద్యార్థి హక్కుల సంఘం స్టేట్ సెక్రటరీ ముని, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి నాగేంద్ర, ఓబీసీ ఆర్గనైజేషన్ ఉత్తరాది ప్రతినిధి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రామిరెడ్డిపల్లిలో మరోసారి హై టెన్షన్

- రేపు ఉపసర్పంచ్ ఎన్నికను నిర్వహించనున్న అధికారులు
- ఎన్నికల సమయంలో జరిగిన దుర్ఘటనతో అప్రమత్తమైన అధికారులు




రామిరెడ్డిపల్లి సచివాలయంతో పాటు కూచువారిపల్లిని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్

చంద్రగిరి: మండలంలోని రామిరెడ్డిపల్లి పంచాయతీలో మరోసారి హై టెన్షన్ వాతావరణం నెలకొంది. పంచాయతీలో ఖాళీ అయిన ఉప సర్పంచ్ పదవిని కైవసం చేసుకునేందుకు వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పోటాపోటీగా ఉన్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా పంచాయతీలో వాతావరణం వేడెక్కింది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పంచాయతీలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు దాడితోపాటు ఇంటిని సైతం దగ్ధం చేసిన ఘటన తెలిసిన విషయమే. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రామిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ ఉమను బలవంతంగా రాజీనామా చేయించారని, అప్పట్లో జోరుగా ప్రచారం జరిగింది. దీంతో ఆ పదవి ఖాళీ అయ్యింది. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పంచాయతీ సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ నాయకుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి ఉండగా, వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు రవిరాజ, దీప, గంగులయ్య, నాగరత్నమ్మ వార్డు సభ్యులుగా కొనసాగుతున్నారు. టీడీపీ తరఫున జానకీ రామనాయుడు, వెంకటరమణ, మధుబాల ఉన్నారు. ఇందులో ఐదుగురు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా, ముగ్గురు టీడీపీకి అనుకూలంగా ఉన్నారు. అయితే అధికార పార్టీ నాయకులు ఎలాగైనా ఉప సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కుటిల రాజకీయాలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

పంచాయతీలో డీఎస్పీ పరిశీలన

రామిరెడ్డిపల్లి పంచాయతీ ఉప సర్పంచ్ అనివార్యం కానున్న నేపథ్యంలో పంచాయతీని చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ సోమవారం పరిశీలించారు. పంచాయతీలోని రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లిలో జరిగిన విధ్వంసాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయన గ్రామాన్ని పరిశీలించినట్లుగా తెలుస్తోంది. గురువారం నిర్వహించే ఉప ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి చర్యలను చేపడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ సీఐ ఇమ్రాన్‌బాషా, ఎస్ఐ అనిత ఉన్నారు.

నష్టపరిహారం అందజేత



బాధితులకు నష్టపరిహారం చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

పాకాల : ఇటీవల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్‌తో మృతి చెందిన రెండు ఆవులకు ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా బాధితులకు పరిహారం అందజేశారు. మంగళవారం బాధితుడు పులివర్తివారిపల్లి గ్రామానికి చెందిన మునయ్యనాయుడుకు రూ.95,000 అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న సురక్ష హాస్పిటల్ అధినేత

తిరుపతి తుడా: బోడే సులోచనమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు సురక్ష హాస్పిటల్ అధినేత డాక్టర్ హేమకుమార్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి తమ స్వగ్రామం బోడెవాండ్లపల్లిలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్వో వాటర్‌ప్లాంట్‌ను చుట్టుపక్కల దాదాపు 15 గ్రామాలకు ఉచితంగా అందజేశారు. దాదాపు 800 మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మామిడి రైతులకు అవగాహన

భాకరాపేట : వాతావరణ మార్పులకు అనుగుణంగా మామిడి తోటలలో పలు జాగ్రత్తలు తప్పనిసరి అని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త పీఎస్ సుధాకర్ తెలిపారు. మంగళవారం భాకరాపేటలో జరిగిన మామిడి రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మామిడిలో తేనేమంచు పురుగు, తామర పురుగు, కాయతొలుచు పురుగులు ఆశించడం వల్ల మామిడి పిందెలు రాలిపోతున్నాయని తెలిపారు. ప్రస్తుత వాతావరణ ఉష్ణోగ్రతలు పెరగడంతో నేలలో తేమశాతం తగ్గి పిందెలు రాలిపోతున్నట్లు చెప్పారు. పురుగు నివారణకు డైనోటోఫూరాన్ 4 శాతం, అసిఫేట్ 50 శాతం, యస్‌జీ 1.25 గ్రాములు, లేదా ఎమామెక్టిన్ బోంబోయేట్ 1.5 గ్రాములు, పిప్రోనిల్ 3.5 గ్రాములు, యస్.సి 1.5 మిల్లీలు లేదా అసిఫేట్ 75 గ్రాములు, వేప నూనె 3 మిల్లీలు, చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే నేల వాతావరణ పరిస్థితుల ఆధారంగా తగినంత నీటి తడులు ఇవ్వాలని, పిందెలు బఠానీ, నిమ్మకాయ సైజు దశల్లో పోషక లోపాలు, హార్మోన్ల లోపాలు రాకుండా 19-19-19 లేదా 13-0-45 లేదా 10 గ్రాములు, ప్లానోఫిక్స్ 0.2 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి పిందె రాలుట నివారించుకోవాలన్నారు.


50 శాతం వడ్డీ మినహాయింపు

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్నులకు 50 శాతం వడ్డీ మినహాయింపు ఇస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 వరకు ఉన్న బకాయిలు మార్చి 31వ తేదీ లోపు ఒకేసారి చెల్లించిన వారికి ప్రస్తుతం ఉన్న వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు.

నేడు వేలం

చంద్రగిరి: చంద్రగిరి పంచాయతీ ఆదాయ వనరులపై బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరత్నం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చంద్రగిరి వారపు సంత, ప్రైవేటు బస్టాండ్, జంతు వధశాలలో రుసుములు వసూలు చేయడానికి బుధవారం ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయ ఆవరణలో వేలం పాట జరుగుతుందన్నారు. ఆర్‌ఓ వాటర్ ప్లాంట్, మరుగుదొడ్ల నిర్వహణ వేలం వాయిదా వేయడం జరిగిందని, ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

సీపీఐ ప్రచార జాతా



మాట్లాడుతున్న హరినాథరెడ్డి

తిరుపతి కల్చరల్: భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం భగత్‌సింగ్ వర్ధంతి 23వ తేదీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సీపీఐ ప్రచార జాతాను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం సీపీఐ కార్యాయంలో ఆ పార్టీ జిల్లాస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు జరగడానికి ప్రతి ఒక్క రూ శక్తి వంచన లేకుండా పని చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- అన్నమయ్య వర్ధంతి సందర్భంగా అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10.30 గంటలకు సాహితీ సదస్సు. సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు
- 33/11కేవీ దొడ్డాపురం ఫీడర్‌లో ఇంటర్ లింక్ విద్యుత్ లైన్ల తొలగింపు కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేకే లేఔట్, మిట్టవీధి, రాథముని వీధి, ఆకుతోట వీధి, ఆర్‌ఎస్ జంక్షన్, పార్లవీధి, రెడ్డిరెడ్డి కాలనీ, దొడ్డాపురం, పంట వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.
- ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేటీ రోడ్డులోని సప్తగిరినగర్, కమ్మ సంఘం హాల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, తిరిగి సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఇన్నర్ ఇంజినీరింగ్ కార్యక్రమం
- శ్రీకోదండరాముని బ్రహ్మోత్సవాలకు రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు అంకురార్పణం, సేనాధిపతి ఉత్సవం.


తుడా ప్లాట్ల విక్రయాలపై సమీక్ష



అధికారులతో చర్చిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి నగరంలోని అన్నమయ్య కూడలి వద్ద నిర్మిస్తున్న తుడా టవర్స్ అమ్మకాలు వేగవంతం చేయాలని ఉపాధ్యక్షురాలు ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. తుడా ప్లాట్స్ అమ్మకాలు, ఇతర అంశాలపై మంగళవారం తుడా కార్యాలయంలో అధికారులతో ఆమె సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుడా టవర్స్‌కు వేలంపాట నిర్వహించగా విశేష స్పందన లభించిందని తెలిపారు. టవర్స్ నిర్మాణ పనుల్లో ఆలస్యం అవుతోందని, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అందరూ పాల్గొని టవర్స్ అమ్మకాలు వేగవంతం చేయాలని అన్నారు. వచ్చే ఫిబ్రవరిలోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, అధికారులు పాల్గొన్నారు.


రోస్టర్ విధానంలో మాదిగలకు అన్యాయం



మాట్లాడుతున్న ఆర్‌జే ప్రకాష్ మాదిగ

తిరుపతి కల్చరల్: ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో రోస్టర్ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు అన్యాయం జరిగేలా వ్యవహరిస్తోందని ఎమ్మార్పీఎస్ దండోర జాతీయ అధ్యక్షుడు ఆర్‌జే.ప్రకాష్ మాదిగ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 ఏళ్లుగా పోరాటం సాగించడం జరిగిందన్నారు. గతంలో సుప్రీంకోర్టు సైతం ఎస్సీ వర్గీకరణకు అడ్డుకట్ట వేసిన విషయం తెలిసిందేనన్నారు. ప్రస్తుతం వర్గీకరణ అధికారాన్ని ఆయా రాష్ట్రాలకు కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణలో భాగంగా రోస్టర్ విధానంలో మాలలకు 8 శాతం, మాదిగలకు 6 శాతం, రెల్లి వర్గానికి ఒక శాతం రిజర్వేషన్లు కల్పించేలా ప్రయత్నం చేయడం సరికాదన్నారు. జిల్లా యూనిట్‌గా తీసుకుంటే మాదిగలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. సమావేశంలో గిరిధర్ మాదిగ, గంధం శ్రీనివాస్ మాదిగ, రాము మాదిగ, కృష్ణ మాదిగ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పరస్పర సహకారం



యూఎన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న వర్సిటీ వీసీ, అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో విద్యాభివృద్ధికి, సాంకేతిక పరిజ్ఞాన సహకారం, పరిశోధనల పురోగతికి పరస్పరం సహాయ సహకారాలు అందించుకునేందుకు హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ పబ్లిక్ డిప్లొమా ఆఫీసర్ ఎమిలియా బి.స్మిత్, ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుతో మంగళవారం చర్చలు జరిగాయి. వీసీ మాట్లాడుతూ ఎస్వీయూ పురోగతి కోసం సైన్స్, టెక్నాలజీ, ఆవిష్కరణలు, ఉన్నత విద్య, అత్యాధునిక పరిశోధన అనుభవం అంశాలపై యూఎన్ ప్రతినిధులతో చర్చించామని చెప్పారు. అమెరికన్ కాన్సులేట్ అధికారి స్మిత్ మాట్లాడుతూ ఎస్వీయూ –అమెరికా దేశ విశ్వవిద్యాలయాల మధ్య విద్యా సహకారాలు, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి, ఉమ్మడి పరిశోధనలలో అమెరికన్ కాన్సులేట్ సహకరిస్తుందని తెలియజేశారు. సమావేశంలో వర్సిటీ ప్రిన్సిపల్స్ శ్రీనివాసులు రెడ్డి, సుధారాణి, సుబ్బారావు, ప్రొఫెసర్లు, రూస కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

'కసాయి'గా ప్రభుత్వ సొమ్మును కాజేశారు


- చంద్రగిరి పంచాయతీ సిబ్బంది చేతివాటం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

చంద్రగిరి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి చంద్రగిరి మండలంలో కూటమి నేతలతో పాటు అధికారులు, సిబ్బంది అవినీతికి అలవాటు పడి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీ ఆదాయానికి గండికొట్టి మరీ నిధులను స్వాహా చేసిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే .. గత ఆరు మాసాల క్రితం చంద్రగిరి పంచాయతీ వారపు సంత, ఆర్టీసీ బస్టాండ్, కసాయి మార్కెట్‌లకు వేలం పాటను నిర్వహించారు. ఇందులో ఆర్టీసీ బస్టాండ్, వారపు సంతను గుత్తేదారులు వేలంలో దక్కించుకున్నారు. అయితే కసాయి మార్కెట్‌ను పలు కారణాలతో వాయిదా వేశారు. ఇదే అదునుగా పంచాయతీ కార్యాలయ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. గత ఆరు నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా కసాయి మార్కెట్‌లో ప్రతివారం రుసుం వసూలు చేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. వారానికి సుమారు రూ.14 వేల మేర ఆరు నెలలకు గాను రూ.3.40 లక్షలను పంచాయతీ అధికారులు తమ బినామీల ద్వారా వసూళ్లకు పాల్పడ్డారు. అయితే వసూలు చేసిన నగదులో ఒక్క రూపాయి కూడా పంచాయతీకి చెల్లించలేదు. అయితే ఆ నగదు ఎవరి జేబుల్లోకి వెళ్లిందనేది ప్రశ్నార్థకం. దీనిపై డీపీఓ, డీఎల్‌పీఓలు విచారణ చేపట్టి ప్రభుత్వ సొమ్మును కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విచారిస్తున్నాం..!

పంచాయతీ గత ఈఓ హయాంలో కసాయి మార్కెట్ వేలం పాటను తాత్కాలికంగా వాయిదా వేశారు. అపై ఎవరికి ఎలాంటి వసూలు చేయమని చెప్పారో తనకు తెలియదు. ఏసీబీ దాడులు జరిగిన తర్వాత ఈఓను నియమించకపోవడంతో ఇన్‌చార్జ్‌గా ఉన్నాను. కసాయి మార్కెట్ నిధుల స్వాహాపై విచారిస్తున్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. – **వెంకటరత్నం, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, చంద్రగిరి**

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



పరదాలు అందజేస్తున్న భక్తులు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన, అనంతరం 7.30 నుంచి 9.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేశారు.

ఆలయానికి పరదాలు సమర్పణ

శ్రీకోదండరామాలయానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ప్రసన్నరెడ్డి అనే భక్తురాలు మూడు పరదాలు, నాలుగు కురాళాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ముని శంకరన్, ప్రధాన అర్చకుడు ఆనందకుమార్ దీక్షితులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

శ్రీకోదండరాముని బ్రహ్మోత్సవాలకు ఈనెల 26న బుధవారం రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు వేడుకగా అంకురార్పణ జరుగనుంది.